పంట నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలి



2



2

ఫీజుల కోసం కాలేజీ యాజమాన్యం వేధింపులు

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in


22-9-2025 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

## ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో గల ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, రాష్ట్ర ఎన్నికల సంఘం డిప్యూటీ సీఈవో హరి సింగ్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా.. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గౌడౌన్ సీల్‌ను తెరిచారు. బ్యాలెట్ యూనిట్లు, ఎన్నికల సామాగ్రిని, భద్రపరచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రత ఏర్పాట్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన కలెక్టర్.. నిరంతరం పనిచేసేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఈవీఎం నోడల్ అధికారి ప్రసాద్, ఎన్నికల విభాగం సిబ్బంది సాత్విక్, జితేందర్ తదితరులున్నారు.

## నిజాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** నిజాంసాగర్ ప్రాజెక్ట్‌కు వరద కొనసాగుతోంది. జలాశయంలోకి ఎగువ నుంచి 65,324 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. సింగూరు, పోచారం ప్రాజెక్ట్‌ల నుంచి వరద వస్తుండడంతో నిజాంసాగర్‌లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 1405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1404.04 అడుగుల (16.417 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి వరద కొనసాగుతుండటంతో గేట్లు ఎత్తి 59,648 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ఆయకట్టు కోసం ప్రధాన కాలువకు వెయ్యి క్యూసెక్కులు వదులుతున్నారు.



## స్పెషల్ పీపీగా దయాకర్ గౌడ్ బాధ్యతల స్వీకరణ

**అక్షర టుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా అడ్వకేట్ దయాకర్ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. పీపీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం జిల్లా కోర్టు ఆవరణలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, ప్రతినిధులు, అడ్వకేట్లు పలువురు ఆయనను ఘనంగా సన్మానించారు. ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, పట్టణ పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, డీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ లీగల్ సెల్ ఛైర్మన్ బైరా గణేష్, నరేందర్, శ్యాంబాబు, పట్టణ పద్మశాలి సంఘం నాయకులు బొట్టు వెంకటేష్ తదితరులు ఉన్నారు.




## భూ సేకరణ ప్రక్రియ నెలాఖరులోపు పూర్తి చేయాలి

**అక్షరటుడే, ఇందూరు:** జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియ నెలాఖరులోపు పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దసరాకు ముందే అన్ని పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కోర్టు కేసులు ఉన్న భూములకు సంబంధించిన పూర్తి వివరాలను వెంటనే ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. టైటిల్ సమస్యలు ఉన్న భూముల విషయంలో పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేసి భూములను సేకరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జాతీయ రహదారుల నిర్మాణం రాష్ట్ర అభివృద్ధి, రవాణా సౌకర్యాల మెరుగుదలకు కీలకమని సీఎం పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, డీఎఫ్‌వో వికాస్ మీనా, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్మావి, ఆర్డీవో రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కొలువుదీరిన అమ్మవారు



దేవీ నవరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన ఆయా మండపాల్లో అమ్మవారిని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలిరోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్





# అటవీ భూములు అన్యాక్రాంతం

**ఉమ్మడి జిల్లాల్లో అటవీ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. కొంతమంది యథేచ్ఛగా అడవులను నరికి వేసి కబ్జాలకు పాల్పడుతున్నారు. అయినా సంబంధిత అధికా రులు చర్యలు చేపట్టడం లేదు. 'అడవు లను ఆక్రమించనివ్వొద్దు, పర్యావర ణానికి హాని కలిగించే చర్యలకు పాల్పడే వారిపై అటవీశాఖ అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని' ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క ఇటీవల తెలిపారు. అయినా అడవుల ఆక్రమణలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.**

- అక్షరటుడే, భీమ్‌గల్



▸ వేలాది ఎకరాలు కబ్జా ▸ పట్టించుకోని అధికారులు

పర్యావరణ సమతుల్యతకు అడవులు ఆయువుపట్టు. ప్రాజెక్టులు, పారిశ్రామికాభివృద్ధి, వ్యవసాయం పేరుతో వేల ఎకరాల్లో అడవులు మాయం అయ్యాయి. అంతేగాకుండా కొంతమంది అటవీ భూములను ఆక్రమిస్తున్నారు. చెట్లను నరికి వేసి భూములను చదును చేస్తున్నారు. అనంతరం వాటిని సాగు భూములుగా మారుస్తున్నారు. రాత్రి పూట చెట్లు నరికి, ట్రాక్టర్లతో చదును చేస్తున్నారు. దీంతో అడవులు కనుమరుగు అవుతాయని పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు.

### ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 1,76,800.30 హెక్టార్ల విస్తీర్ణంలో అటవీ ప్రాంతం ఉంది. కామారెడ్డి డివిజన్‌లోని ఇందల్వాయి, ఎల్లారెడ్డి, కామారెడ్డి రేంజ్‌ల పరిధిలో 94,030.28హెక్టార్లు, నిజామాబాద్ డివిజన్‌లోని నిజామాబాద్, బాన్సువాడ, కమ్మర్‌పల్లి, రెంజల్ రేంజ్‌ల పరిధిలో 82,770.02 హెక్టార్లలో అడవులు ఉన్నాయి. అధికారుల లెక్కల ప్రకారం.. నిజామాబాద్ జిల్లాలో 1952.09 ఎకరాలు, కామారెడ్డిలో 1190.04 ఎకరాల అటవీ భూములు కబ్జాకు గురయ్యాయి.

### అంతకుమించి..

అధికారుల లెక్కల్లో ఆక్రమణలు తక్కువగా చెబుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వేలాది ఎకరాల్లో భూములు అన్యాక్రాంతం అయినా వందల ఎకరాలు అయినట్లు రికార్డుల్లో నమోదు చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇందల్వాయి రేంజ్ పరిధిలో రెండు వేల ఎకరాల్లో, గాంధారిలో 3,200, బాన్సువాడలో 4 వేలు, ఎల్లారెడ్డిలో 1,700, కమ్మర్‌పల్లిలో 4 వేలు, కామారెడ్డిలో 1400 ఎకరాల భూమి కబ్జా అయింది. మొత్తం 16,300 ఎకరాల అటవీభూమి కబ్జాకు గురైనట్లు తెలుస్తోంది. అయితే అధికారుల లెక్కల్లో మాత్రం ఉమ్మడి జిల్లాలో 3,142 ఎకరాల్లోనే కబ్జా అయినట్లు చెబుతుండడం గమనార్హం.

### కబ్జాకు అయిన కొన్ని భూములు

- కమ్మర్‌పల్లి రేంజ్ పరిధిలోని 11 తండాల్లో వేలాది ఎకరాల అటవీభూమి ఆక్రమణకు గురైంది. కొండలు, గుట్టలు సైతం ఆనవాళ్లు కోల్పోయాయి.
- భీమ్‌గల్ మండలం దేవక్కపేట్, దేవన్‌పల్లి, కారేపల్లి, తాళ్లపల్లి, రహత్‌నగర్ గ్రామాల పరిధిలో గుట్టలను పూర్తిగా దున్నేసి చదును చేశారు.
- సికింద్రాపూర్ గ్రామ శివారుల్లో భారీగా ఆక్రమణలు జరిగాయి.
- ఎల్లారెడ్డి రేంజ్ పరిధిలో అడవిలింగాల, ఎల్లుట్ల, ఎల్లుట్లపేట్ గ్రామాల పరిధిలో అటవీభూమిని పెద్ద ఎత్తున ఆక్రమించారు.
- సిరికొండ మండలం మైలారం, రావుట్ల, చీమన్‌పల్లి, ధర్పల్లి మండలం కొరట్‌పల్లి, దుబ్బాక, చల్లగరిగే గ్రామాల శివారులో అటవీభూమిని కబ్జా చేశారు.
- గాంధారి మండలం గండివేట్, యాచారం, చద్మల్ తండా, దుర్గం, నాగ్లూరు గ్రామాల పరిధిలో ఆక్రమణలు జరిగాయి.
- కామారెడ్డి రేంజ్ పరిధిలో భిక్కనూరు, నాగిరెడ్డిపేట్ మండలాల్లో అటవీభూమి ఆక్రమణకు గురైంది.
- బిచ్కుంద మండలంలోని శాంతాపూర్, బేగంపూర్, ఎల్లారం, కాస్లాబాద్ తదితర గ్రామాల పరిధిలో అటవీభూములను కొందరు ఆక్రమించారు.

## ప్రజావాణికి 89 ఫిర్యాదులు



**అక్షరటుడే, ఇందూరు:** ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 89 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్‌తో పాటు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, మెప్మా పీడీ రాజేందర్, ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు అందజేశారు. కాగా.. ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు.

## బీర్కూర్ ఎస్సైగా మహేందర్ బాధ్యతల స్వీకరణ



**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూర్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా మహేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇప్పటివరకు పనిచేసిన రాజశేఖర్ బదిలీపై కామారెడ్డికి వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్సై మహేందర్‌కు స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి, ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వర్తిస్తానని తెలిపారు.

## బస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి




**అక్షరటుడే, ఇందూరు:** బస్టాండ్ సమీపంలో తరచూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని ఆర్టీసీ నిజామాబాద్ డిపో-1 మేనేజర్ ఆనంద్ కుమార్ అన్నారు. ఈ మేరకు పోలీస్ కమిషనర్ సాయి చైతన్యను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. నగరంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల గురించి వివరించామని తెలిపారు. అలాగే ట్రాఫిక్ సమస్యను పరిష్కరించి ఆర్టీసీకి సహకరించాలని కోరామన్నారు. ఇప్పటికే డ్రైవర్లకు కూడా పలు సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ మహిపాల్ ప్రభుదాస్ పాల్గొన్నారు.

## ఆర్ఎంను కలిసిన కామారెడ్డి డీఎం



**అక్షరటుడే, ఇందూరు:** ఆర్టీసీ కామారెడ్డి డిపో మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన దినేష్ కుమార్ సోమవారం రీజినల్ మేనేజర్ జోత్స్నను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రయాణికుల సమస్యల పరిష్కారంపై ఆయనకు ఆర్ఎం పలు సూచనలు చేశారు. కాగా.. దినేష్ కుమార్ ఇటీవల ఖమ్మం నుంచి కామారెడ్డికి బదిలీ పై వచ్చారు.

## కలెక్టరేట్ వద్ద మహిళల ఆందోళన

**అక్షర టుడే, కామారెడ్డి:** భారీ వర్షాలతో గ్రామం జల దిగ్బంధంలో చిక్కుకుని, ఆస్తి, పంట నష్టంతో తీవ్ర ఇబ్బంది పడినా.. ఒక్కరూ పట్టించుకోలేదని రామారెడ్డి మండలం కన్నాపూర్ గ్రామస్థులు వాపోయారు. ఈ మేరకు తమను ఆదుకోవాలని సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారీ వర్షాలకు గ్రామం ఇప్పటికి జల దిగ్బంధంలో ఉందని, రోడ్లు, చెరువు తెగిపోవడంతో గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచాయన్నారు. తినడానికి తిండికి లేక, నిత్యావసర సరుకులు తెచ్చేవారు లేక ఆకలితో అలమటిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కనీసం గ్రామంలోకి రాలేదని వాపోయారు. చౌదరి చెరువు కింద సుమారుగా 1500 ఎకరాలు ఉండగా, చెరువు కట్ట తెగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి కన్నాపూర్ గ్రామాన్ని సందర్శించి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. లేని పక్షంలో కలెక్టరేట్ ముందు మూకుమ్మడి ఆత్మహత్య చేసుకుంటామన్నారు.




కామారెడ్డి కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు




ఫ్లడ్ రిలీఫ్ ఫండ్ చెక్కును కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

## వరద బాధితులకు పీఆర్టీయూ ఆర్థిక సహాయం

**అక్షరటుడే, కామారెడ్డి:** ఇటీవల భారీ వర్షాలతో నష్ట పోయిన వరద బాధితులకు పీఆర్టీయూ తెలంగాణ సంఘం నాయకులు అండగా నిలిచారు. జిల్లా శాఖ పిలుపు మేరకు కలెక్టర్ ఫ్లడ్ రిలీఫ్ ఫండ్ కోసం రూ.7,06,011 విరాళం సేకరించారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను కలిసి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వరద బాధితుల సహాయ నిధికి సహకరించిన పీఆర్టీయూ తెలంగాణ జిల్లా బాధ్యులను అభినందించారు. ఆపద సమయంలో ఆదుకునేందుకు ముందుకు వచ్చి ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాలను మరిన్ని నిర్వహించి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో రాజు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కుశాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర సహాధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, సంగారెడ్డి, గోవర్దన్, వివిధ మండల శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హన్మాండ్లు, రమణ, రామచంద్ర రెడ్డి, ప్రసాద్, సంతోష్, రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.

అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND

2

నిజామాబాద్/కామారెడ్డి
సోమవారం
22.9.2025

www.aksharatoday.in
AKSHARA TODAY




## పేదల సంక్షేమానికి ప్రాధాన్యత

**అక్షరటుడే, కోటగిరి:** కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్ అన్నారు. పోతంగల్ మండల కేంద్రంలోని సాయిబాబా మందిరం కల్యాణ మండపంలో సోమవారం ఉమ్మడి మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెల్ల రేషన్ కార్డుదారులకు తమ ప్రభుత్వం సన్న బియ్యం అందిస్తోందన్నారు. రైతులకు రుణమాఫీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. త్వరలో బోనస్ డబ్బులు కూడా అందజేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు చేస్తున్న అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు రాని వారికి మంజూరు చేస్తామన్నారు.



## స్వదేశీ జాగరణ మంచ్ కరపత్రాల ఆవిష్కరణ

**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం స్వదేశీ జాగరణ మంచ్ కరపత్రాలు ఆవిష్కరించారు. నాగ లింగేశ్వర ఆలయంలో బీజేపీ జిల్లా నాయకులు కలిగోట గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్లు రెడ్డి ప్రకాష్, గుర్రం వెంకట రమణ కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులను వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు. మనం తయారు చేసిన వస్తువులు మనం వాడుకుంటే ప్రధాని మోదీ లక్ష్యం వికసిత్ భారత్ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కలిగోట ప్రశాంత్, పిట్ల శ్రీధర్, తోట నారాయణ, ప్రముఖ వ్యాపారస్థులు సత్య శ్రీనివాస్, గజవాడ రాజయ్య, పడిగేల్ శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



## ఫీజుల కోసం కాలేజీ యాజమాన్యం వేధింపులు

**అక్షరటుడే, ఇందూరు:** అధిక ఫీజులు చెల్లించాలని కళాశాల యాజమాన్యం వేధిస్తోందని ఆర్మూర్ క్షత్రియ కళాశాల డిప్లొమా విద్యార్థులు వాపోయారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము కళాశాలలో మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొందినప్పుడు ఫీజు రీయింబర్స్ మెంట్ రూ.15,780 పోను, కళాశాల ఫీజు రూ. 880 చెల్లించామన్నారు. అయితే ఈ సంవత్సరం ఫీజు రీయింబర్స్ మెంట్, కళాశాల ఫీజు, బిల్డింగ్ డెవలప్ మెంట్ ఫీజు పేరుతో మొత్తం రూ.24 వేలు చెల్లించాలంటూ యాజమాన్యం ఒత్తిడి తెస్తోందన్నారు. పేద విద్యార్థులమైన తాము అంత ఫీజు చెల్లించలేమని వాపోయారు. తమ సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. వినతి పత్రం అందించిన వారిలో 50 మంది విద్యార్థులు ఉన్నారు.



## డబుల్ బెడ్ రూం ఇళ్ల బిల్లులు చెల్లించాలి

**అక్షరటుడే, కోటగిరి:** డబుల్ బెడ్‌రూం ఇళ్ల బిల్లులు చెల్లించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో లబ్ధిదారులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రం ఇచ్చినా స్పందించడం లేదన్నారు. రెండేళ్లుగా బిల్లులు లేక లబ్ధిదారులు తీవ్ర అవస్థలు పడుతున్నామని వాపోయారు. ఒకరి బిల్లులను మరొకరికి ఇచ్చి డబుల్ బెడ్‌రూం బిల్లుల చెల్లింపులో అవినీతికి పాల్పడ్డారని, సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓట్ల కోసం నాయకులు తమ అనుచరులకు డబుల్ బెడ్ రూం బిల్లులను అందించారని, అర్హులైన లబ్ధిదారులకు మాత్రం బిల్లులు ఇవ్వలేదని మండిపడ్డారు.

## పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య

**అక్షరటుడే, కామారెడ్డి :** తనకు పెళ్లి సంబంధాలు కుదరడం లేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన కామారెడ్డి మండలం నర్సన్నపల్లిలో చోటు చేసుకుంది. నర్సన్నపల్లి గ్రామానికి చెందిన ధ్యాప మహేష్(28) బతుకుదెరువు కోసం 8 ఏళ్ల పాటు దుబాయి వెళ్లాడు. ఆయన అక్కడ ఉండగానే తల్లి చనిపోయింది. దీంతో రెండేళ్ల క్రితం స్వగ్రామం వచ్చిన మహేశ్ పెళ్లి చేసుకొని ఇక్కడే స్థిరపడాలని భావించాడు. అయితే రెండేళ్ల నుంచి సంబంధాలు చూస్తున్నా ఆయనకు పెళ్లి కుదరడం లేదు. దీంతో తనకు పెళ్లి సంబంధాలు కుదరడం లేదని మహేష్ మనోవేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.



నిజామాబాద్ నగరంలో..








నగరంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో..





ఎల్లారెడ్డిలో..



కోటగిరిలో..




ఇందల్వాయిలో..





నిజామాబాద్ నుంచి పిప్రికి విగ్రహాన్ని తీసుకెస్తున్న భక్తులు





## వంతెన పనులు వేగంగా నిర్వహించాలి

**అక్షరటుడే, లింగంపేట:** లింగంపేట మండలం లింగంపల్లి కుర్దు గ్రామ సమీపంలోని కేకేవై రహదారిపై గల పాములవాగు తాత్కాలిక వంతెన పనులు నత్తనడకన సాగుతున్నాయని బీజేపీ మండలాధ్యక్షుడు బొల్లారం క్రాంతికుమార్ అన్నారు. ఈ మేరకు ఎంపీడీవోకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ.. వంతెన కుంగిపోయి కామారెడ్డి - లింగంపేట - ఎల్లారెడ్డి నిజాంసాగర్‌కు బస్సుల రాకపోకలు నిలిచిపోయన్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. వర్షం కురిసి 20 రోజులు దాటినా ఇప్పటివరకు తాత్కాలిక వంతెన పూర్తి చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. వెంటనే వంతెన పనులు పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరారు.



## కళాశాలలో రక్తదాన శిబిరం

**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ ఎస్ఎస్ఎల్ డిగ్రీ కళాశాలలో మేరా యువ భారత్ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు.




ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సునీల్ రాథోడ్ మాట్లాడుతూ.. అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఒకరికి పునర్జన్మ కల్పించవచ్చారు. రోడ్డు ప్రమాదాలు, సిజేరియన్ డెలివరీలు వంటి సందర్భాల్లో రక్తం అవసరం ఎక్కువగా ఉంటుందని వివరించారు. అయితే యువత రక్తదానం పట్ల పెద్దగా ముందుకు రాకపోవడం విచారకరమని తెలిపారు. యువతరం రక్తదానంలో ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎల్ కళాశాల ప్రిన్సిపాల్ సుభాష్ గౌడ్, లక్ష్మణ్, అంజయ్య, నాగరాజు, బాన్సువాడ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## పంట నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నాగిరెడ్డిపేట మండలంలో మంజీర పరీవాహక ప్రాంతాల గ్రామాలకు చెందిన రైతులు రోడ్డెక్కారు. మండల కేంద్రంలో సోమవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. భారీ వర్షాలతో వందల ఎకరాల్లో పంటలు




ముంపునకు గురై నష్టపోయామని వాపోయారు. ప్రభుత్వం తమను ఆర్థికంగా వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నాగిరెడ్డిపేట మండలంలో పంటలు, రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. పంట నష్టం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించకుండా సీఎం రేవంత్ రెడ్డి తాడ్వాయి మండలానికి వచ్చివెళ్లాడని, విహారయాత్రకు వచ్చి వెళ్లినట్టుగా తన పర్యటన సాగిందని మండిపడ్డారు. సీఎం నియోజకవర్గానికి వచ్చి వెళ్లి 20 రోజులు గడుస్తున్నా నేటికీ రైతులకు నష్టపరిహారం అందలేదని పేర్కొన్నారు. రోడ్లకు మరమ్మతులు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



## 'గిరిరాజ్'లో బతుకమ్మ సంబరాలు

**అక్షరటుడే, ఇందూరు:** గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళా అధ్యాపకులు విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలను చేశారు. కళాశాల ప్రాంగణంలో ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ రాష్ట్ర పండుగ అని అన్నారు. ప్రకృతిని ఆరాధించే ప్రత్యేకమైన పండుగ అని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం, పీఆర్‌వో దండు స్వామి, ఉమెన్ ఎంపవర్ మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ నహీదా బేగం, రజిత, నాగజ్యోతి, ప్రతిభ, నవీన, లావణ్య, శ్రీలేఖ, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ జట్లకు కెప్టెన్‌లుగా పేట్ సంగెం విద్యార్థులు

**అక్షరటుడే, గాంధారి:** గాంధారి మండలంలోని పేట్ సంగెం ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్లకు కెప్టెన్‌లుగా సారథ్యం వహించనున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ క్రీడా మైదానంలో జరిగిన సబ్ జూనియర్ జిల్లా స్థాయి కబడ్డీ టోర్నీలో పేట్ సంగెం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. దీంతో రాష్ట్ర స్థాయి బాలికల జట్టుకు బాలికల జట్టుకు భానుతుషా, బాలుర జట్టుకు బుక్య అర్జున్‌లను ఎంపిక చేశారు. అలాగే అదే పాఠశాలకు చెందిన అవంతిక కూడా సెప్టెంబర్ 25న నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలంలోని ఇండోర్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థుల ఎంపికపై భామన్ స్పోర్ట్స్ ఫౌండేషన్ బాధ్యులు సురేందర్, అధ్యక్షుడు సేవాంతరాథోడ్, గ్రామస్థులు అభినందించారు.





## బాల్కొండలో స్వస్త్ నారీ సశక్తి వైద్య శిబిరం తనిఖీ

**అక్షరటుడే, మెండోరా:** బాల్కొండ మండలం కిసాన్‌నగర్ పీహెచ్‌సీలో జరుగుతున్న స్వస్త్ నారీ సశక్తి కుటుంబ అభియాన్ వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో రాజశ్రీ సోమవారం తనిఖీ చేశారు. మహిళలు, చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేయాలని ఆదేశించారు. ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించడంతో పాటు అనారోగ్యానికి గురైతే సకాలంలో వైద్య సాయం ఎంతో అవసరమని వివరించారు. ఆమె వెంట డీఎస్‌వో నాగరాజు, డాక్టర్ స్రవంతి, వైద్య సిబ్బంది యశ్వంత్, భానుప్రియ, మధు, నవీన్, ల్యాబ్ టెక్నీషియన్ వీరయ్య గౌడ్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

## విద్యార్థి సంఘాల నాయకుల ముందస్తు అరెస్ట్

**అక్షరటుడే, గాంధారి:** గిరిజన విద్యార్థి సంఘం నాయకులు గాంధారి పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటి ముందు ముట్టికి రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గాంధారి మండల కేంద్రానికి చెందిన జీవీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఎల్‌హెచ్‌పీఎస్ కామారెడ్డి జిల్లా యువజన అధ్యక్షుడు ప్రేమ్ నాయక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## పద్మశాలీలకు సముచిత స్థానం కల్పించాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాల్లో పద్మశాలి ప్రతినిధులకు సముచిత స్థానం కల్పించాలని పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు పెంట దత్తాద్రి కోరారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. మహనీయుల కార్యక్రమాలకు తప్పకుండా నగర పద్మశాలి సంఘం ప్రతినిధులకు ఆహ్వానం అందించాలని కోరారు.



## డీకంపల్లిలో గ్రామపంచాయతీ నూతన భవన్‌కు భూమి పూజ

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆలూర్ మండలం డీకంపల్లిలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఎంపీడీవో గంగాధర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. రూ. 20 లక్షల వ్యయంతో భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన పాలన అందించడం మా లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దినేష్, ఏఈ సూర్య, వీడీసీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బైక్ చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నగరంలోని వన్ టౌన్ పరిధిలో బైక్ చోరీ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. ఈనెల 19న తూంపల్లికి చెందిన భూక్య విఠల్ తన బైక్‌ను బస్టాండ్ వద్ద పార్క్ చేసి లోపలికి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి బైక్ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నగరంలోని దేవిరోడ్డులో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపడుతుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు పారిపోయేందుకు యత్నించారు. దీంతో వారిని పట్టుకొని నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన హనువాతే భీం, సుభాష్‌గా గుర్తించారు. జల్సాలకు అలవాటు పడిన వీరు బైక్ దొంగతనాలు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. భైంసా, నందిపేట్, బాల్కొండ ప్రాంతాల్లోనూ చోరీలు చేశారన్నారు. వారి నుంచి నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.